క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: నర్సాపూర్‌కు చెందిన వ్యక్తికి ఎమ్మెల్యే సునీతారెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే ఎల్‌ఓసీతో మెరుగైన వైద్యం పొందవచ్చని చెప్పారు. నర్సాపూర్‌కు చెందిన చిన్నారి ధనుశ్రీ అనారోగ్యంతో బాధపడుతున్నందున ఆమెకు మెరుగైన వైద్యం కోసం ఒక టిన్నర లక్షల రూపాయల ఎల్‌ఓసీని ఆమె తండ్రి హన్మంతుకు అందజేశారు. ఆమె వెంట మున్సిపల్‌చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయిమోద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని అల్లీపూర్ తండాలో నూతనంగా నిర్మిస్తున్న సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి బుధవారం విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణంలో భాగంగా సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహానికి అవసరం ఉన్న నిధులు అందజేస్తానని తండావాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు పాల్గొన్నారు.

నేడు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని అన్ని పాఠశాలలో గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మండల వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే ఆనారోగ్యానికి గురి అవుతారని చెప్పారు. 1నుంచి 19 ఏళ్లలోపు వారందరు నులిపురుగుల నివారణకు మాత్రలు వేసుకోవాలని చెప్పారు. మండలంలోని కూకుట్లపల్లి ప్రాథమిక పాఠశాలలో నులిపురుగుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంచందర్, ఉపాధ్యాయులు వెంకటేశం, ఆశ వర్కర్ సుగుణ పాల్గొన్నారు.


సర్కారు పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం వెంకటేశం

వెల్దుర్తి(తూప్రాన్): మండల పరిధిలోని శేరీల ప్రభుత్వ పాఠశాలలో బుధవారం నూతన విద్యార్థులతో హెచ్‌ఎం వెంకటేశం ఆధ్వర్యంలో వేదపండితుడితో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తుందని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. బాగా చదువుకొని విద్యావంతులు అయినప్పుడే సమాజంలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ రంగాల్లో సమానత్వాన్ని సాధించగలమన్నారు.

చెక్కు అందజేత



బీమా చెక్కును అందిస్తున్న న్యాయమూర్తి

మెదక్‌జోన్: మోటార్ వెహికిల్ ప్రమాదంలో ఇరుపక్షాల వారిని రాజీ కుదిర్చి బాధిత కుటుంబానికి రూ. 12 లక్షల బీమా సొమ్మును బుధవారం లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద ఇప్పించారు. గౌరవ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్‌పర్సన్, లక్ష్మీశారద అధ్యక్షతన జిల్లా కోర్టులో ఈరోజు డైలీ లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్ అడ్వకేట్ శ్రీనివాస రావు, పిటిషనర్ తరపు అడ్వకేట్ బాలయ్య పాల్గొన్నారు.

పాలన కొనసాగేదెలా?

- గ్రామ పంచాయతీలకు నిధుల కొరత
- పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు కరువు
- పంచాయతీ కార్యదర్శులకు తప్పని తిప్పలు



బూర్గుపల్లి గ్రామపంచాయితీ భవనం

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామ పంచాయతీల ఖాతాల్లో నిధులు లేక అభివృద్ధి ముందుకు సాగడంలేదు. పల్లెలకు కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే అన్న చందంగా మారింది. నిధుల లేమితో కనీసం పంచాయతీ కార్మికులకు వేతనాలు అందించని పరిస్థితిలో పల్లెలు కొట్టుమిట్టాడుతున్నాయి. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారుల పాలనలో నిధులు లేకపోవడంతో గ్రామకార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా 21 మండలాలుండగా, వాటి పరిధిలో 469 గ్రామపంచాయతీలున్నాయి. వీటిలో 3 వేల పైచీలుకు జనాభా గల పెద్దపంచాయతీలు 63 ఉండగా, 406 చిన్న గ్రామపంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీలకు గతంలో మూడు నెలలకు ఒకసారి స్టేట్ ఫైనాన్స్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించేది. 15వ ఫైనాన్స్ నుంచి కేంద్రం నిధులు కేటాయించేది. ప్రస్తుతం పాలక వర్గంలేకపోవడంతో నిధులు విడుదల కావడం లేదు. ప్రతీ నెల 2011 జనాభా ప్రాతిపాదికన రూ.6.70 కోట్లను పంచాయతీలకు నిధులు వచ్చేవి. ఎన్నికల నేపథ్యంలో, ప్రభుత్వం మారడంతో పంచాయతీలకు నిధులు విడుదల కాలేదు. దీంతో ప్రత్యేకాధికారుల పాలనలో కార్యదర్శులకు అవస్థలు తప్పడం లేదు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వాహణకు ప్రభుత్వం ప్రతీ గ్రామపంచాయతీకి ట్రాక్టర్‌ను కేటాయించింది. వీటి నిర్వాహణ కూడా ప్రస్తుతం ఇబ్బందిగా మారింది. డీజిల్ లేకపోవడం, ట్రాక్టర్‌లకు మరమ్మతులు చేయించలేకపోవడం వంటి సమస్యలు కార్యదర్శులను పీడిస్తున్నాయి. పలు గ్రామాల్లో డీజిల్ తేవడానికి ఆర్థిక ఇబ్బందులతో రెండు, మూడు రోజులకు ఒకసారి ట్రాక్టర్‌ల ద్వారా చెత్తను తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్దశంకరంపేట వ్యాప్తంగా దాదాపు 108 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఎన్నికలను నిర్వహించి, పాలక వర్గాన్ని ఏర్పాటు చేసి నిధులు కేటాయిస్తే పంచాయతీలు అభివృద్ధిలో ముందుకు సాగే అవకాశం ఉంది.

వేతనాలు ఇవ్వాలి

ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికులను నెలనెలా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. కుటుంబపోషణ కష్టతరంగా మారుతోంది. ప్రభుత్వం స్పందించి వేతనాలు వచ్చేలా చూడాలి. అలాగే రెగ్యులర్ చేయాలి

– ఎస్.సాయిలు, బూర్గుపల్లి, పెద్దశంకరంపేట

నిధులు రావడం లేదు

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ట్రాక్టర్ రిపేర్‌లు, డీజిల్‌తో పాటు చిన్నపాటి బోరు మోటార్ల మరమ్మతులు, ఇతర పనులకు ఇబ్బందిగా ఉంటోంది. ప్రభుత్వం పంచాయతీలకు పాలకవర్గాలను ఏర్పాటు చేసే వరకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి.

– చక్రధర్, మండల గ్రామ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు, పెద్దశంకరంపేట

దానాల్లో కన్నా రక్త దానం మిన్న

మెదక్ ఎమ్మెల్యే రోహిత్



లక్షీనగర్‌లో రక్తదానం చేస్తున్న యువకులు

పాపన్నపేట(మెదక్): దానాల్లో కెల్ల రక్తదానం మిన్న అని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వాహనానికి పెట్రోల్ లాగా మనిషికి రక్తం జీవక్రియలు సజావుగా సాగడానికి ఉపయోగ పడుతుందన్నారు. పోషకాహారం లేక పలువురు రక్త హీనతతో బాధపడుతున్నారని తెలిపారు. ఆకు కూరలు తినడం ద్వారా రక్తహీనత అరికట్ట వచ్చన్నారు. ప్రతీ ఆరోగ్య వంతుడైన మనిషి రక్తదానం చేయాలని పిలుపు నిచ్చారు. తద్వార అనేక మంది ప్రాణాలు కాపాడ వచ్చన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ప్రణయ్ బాధ్యత నాదే..

ఇటీవల అప్పుల బాధతో కొత్తపల్లిలో ఆత్మహత్య చేసుకున్న టప్ప మల్లేశ్ కుటుంబాన్ని ఎమ్మెల్యే రోహిత్ పరామర్శించారు. వారి కుటుంబ దీనస్థితికి చలించిన ఆయన బాధితుడి కుమారుడు ప్రణయ్ బాధ్యత తానే తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అతని చదువులకు అవసరమైన ఆర్థిక వనరులు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీకాంతప్ప ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మంత్రి కొండా సురేఖ

నర్సాపూర్: నర్సాపూర్‌లోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఏఐసీసీ అధినేత, ఎంపీ రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నాయకులు నీలం మధు, సుహాసినిరెడ్డి, ఎంపీపీ జ్యోతి, కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజుయాదవ్, గోమారం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ



లైబ్రరీలో రికార్డులు తనిఖీ చేస్తున్న వంశీకృష్ణ

కౌడిపల్లి(నర్సాపూర్): గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ తెలిపారు. బుధవారం కౌడిపల్లి శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో రికార్డులు, పుస్తకాలు, పాఠకుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మట్లాడుతూ.. జిల్లాలో 15 శాఖ గ్రంథాలయాలు, రెండు గ్రామీణ గ్రంథాలయాలతో పాటు జిల్లా కేంద్రంలో కేంద్ర గ్రంథాలయం ఉన్నట్లు చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం రాష్ట్రంలో మంచి గుర్తింపు పొందిందన్నారు. అన్ని గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రంథాలయాల్లో విద్యార్థులు పోటీపరీక్ష సిద్ధం అయ్యేందుకు కావాల్సిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కౌడిపల్లి శాఖ గ్రంథాలయంలో మైనర్ రిపేర్లతో పాటు నూతనంగా టాయిలెట్స్ నిర్మాణానికి కృషి చేస్తాన్నారు. సొంత భవనంలోకి మారితే సమస్య ఉండదని చెప్పారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవం



రామాయంపేటలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసిన బీజేపీ, వీహెచ్‌పీ ప్రతినిధులు

రామాయంపేట(మెదక్): పట్టణంలో బుధవారం బీజేపీ, వీహెచ్‌పీ కార్యకర్తలు హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు శివాజీ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి పూలమాలలు వేసి కాషాయ ధ్వజాన్ని ఎగురవేశారు. యువత శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని పార్టీ ప్రతినిధులు సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ సంఘటనా కార్యదర్శి మల్లేశం, బీజేపీ జిల్లా నాయకులు రాజేంద్రప్రసాద్, శంకర్‌గౌడ్, మండలాధ్యక్షుడు దయానందరెడ్డి, నాయకులు శేఖర్, దామోదర్‌రావు, యాదగిరిగౌడ్, నాగరాజు, రమాకాంత్, నరేందర్ పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే



నందిగామలో ఆరోగ్య సర్వే చేస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందిగామ గ్రామంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలో భాగంగా 15 నుంచి 49 ఏళ్ల వయస్సుల గల స్త్రీలలో ఆరోగ్య వివరాలను సర్వే అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు బుధవారం నందిగామ గ్రామంలో బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాల వ్యాధుల గురించి సర్వే చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్, ఆశవర్కర్లు, గోరి, సర్వే సూపర్‌వైజర్ నారాయణ మూర్తి, ఫీల్డ్ ఇన్వేస్టిగేటర్ ఆదిలక్ష్మి, భవాని, రమ్య, ల్యాబ్ టెక్నీషియన్, సంతోష్, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు



కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): వ్యవసాయ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం 12 గంటల వరకు వ్యవసాయ కార్యాలయానికి తాళం వేసి ఉంది. దీంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన రైతులు ఇబ్బందులు పడ్డారు. సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి లావణ్య వివరణ కోరగా.. మధ్యాహ్నం వరకు సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పంటల వివరాల నమోదు పనిలో ఉన్నందున మధ్యాహ్నం తర్వాత కార్యాలయంలో అందుబాటులో ఉంటున్నట్లు చెప్పారు.

కళాశాలల్లో చేరితే ఉచితంగా పుస్తకాలు



రామాయంపేట(మెదక్): విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

రామాయంపేట ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

రామాయంపేట(మెదక్): ప్రభుత్వ కళాశాలలో చేరే విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేస్తామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతుందన్నారు. రామాయంపేటలోని కళాశాలలో జనరల్ కోర్సులతో పాటు వృత్తి విద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి గ్రూపులో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిజాంపేట(మెదక్): కల్వకుంట గ్రామంలో విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

బ్యాగుల పంపిణీ

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో వీఎస్‌ఏ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కంఠారెడ్డి చంద్రారెడ్డి బుధవారం అంగన్‌వాడీ, ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, పెన్సిల్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ విద్యార్థుల నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు సుమారుగా 450 మందికి బ్యాగులు పంపిణీ చేసిన్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటి కోసం వాటర్ ప్యూరిఫైయర్‌లను అమర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధార్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, స్వామి, శ్రీనివాస్‌గౌడ్, రంగ స్వామి, రంగ నర్సింలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు డీవార్మింగ్

టేక్మాల్ వైద్యాధికారి డాక్టర్ కృతిక



డాక్టర్ కృతిక, వైద్యాధికారి టేక్మాల్

టేక్మాల్(మెదక్): చిన్నపిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏటా చేపడుతుందని డాక్టర్ కృతిక తెలిపారు. బుధవారం ఈ సందర్భంగా ఆమె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడుతూ.. 19 ఏళ్లలోపు బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. 20న, 27న అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు ఉచితంగా మాత్రలు అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

ఎలా వ్యాపిస్తాయంటే..

పిల్లలు మలవిసర్జన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోకపోవడం, ఆహారం తీసుకోవడం వల్ల కడుపులోని పేగుల్లో నులిపురుగులు వృద్ధి చెందుతాయని ఆమె తెలిపారు. రక్తహీనత, పోషకాహార లోపం వంటి ఆనారోగ్య సమస్యలు తలెత్తి పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపుతుందని తెలిపారు. నులిపురుగులు సోకిన పిల్లలు బహిరంగ మలవిసర్జన చేసినప్పుడు నేల కలుషితం అవుతుందన్నారు. పాఠశాలలో చదువుతున్న ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని దీనిపై తల్లిదండ్రుల సైతం అవగాహన కలిగి ఉండాలని ఆమె తెలిపారు.

సమస్యలు తలెత్తకుండా చూడాలి: ఎంపీపీ భాగ్యలక్ష్మి

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులు చురుకుగా పని చేయాలని ఎంపీపీ భాగ్యలక్ష్మి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దామోదర్, ఎంపీఓ కరిముల్ల పాల్గొన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

హవేళిఘణాపూర్(మెదక్): మెదక్, హవేళిఘణాపూర్ మండలాల్లోని మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నల్లా కనెక్షన్లను పంచాయతీ సెక్రటరీలు సర్వే నిర్వహిస్తున్నారు. ఇంటి యజమాని ఫొటో, నల్లా నీరు వస్తుందా..లేదా? ఇంట్లో ఎంత మంది నివసిస్తున్నారని వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దాదాపు ఇప్పటి వరకు మెదక్, హవేళిఘణాపూర్ మండలాల్లోని మేజర్ గ్రామ పంచాయతీలు మినహా మిగతా అన్ని గ్రామాల్లో 90 శాతం సర్వే పూర్తయినట్లు మెదక్ ఎంపీవో ప్రశాంత్ తెలిపారు.

నారుమడిలో జాగ్రత్తలు అవసరం

హవేళిఘణాపూర్(మెదక్): వరి నారుమడుల్లో సూక్ష్మ లోపాలను రైతులు గమనిస్తూ వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఏఓ నాగ మాధురి అన్నారు. బుధవారం మండల పరిధిలోని తొగిట గ్రామంలోని రైతులు సాగు చేసిన జిలుగ, వరి నారుమడులను ఆమె పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు వరి నారుమడులలో వచ్చే సూక్ష్మ లోపాలను గుర్తించి అవసరమైతే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి పలు సూచనలు తీసుకోవాలని సూచించారు. ఏఓ వెంట రైతులు సత్యం, రవీందర్ తదితరులు ఉన్నారు.

నేటి ధర్నాకు తరలిరండి

మెదక్ కలెక్టరేట్: గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాల కోసం గురువారం రాష్ట్ర వ్యాప్త ధర్నా మెదక్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని గ్రామ పంచాయతీ సిబ్బంది ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకోవాలని నర్సమ్మ తెలిపారు.

తైబజార్ వేలం రూ.3,41,000

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో బుధవారం గ్రామపంచాయతీ తైబజారు వేలంపాట నిర్వహించారు. ఎంపీఓ నరేష్, గ్రామ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా.. మైలారం రవీందర్ రూ. 3,41000 కు తై బజారును వేలంపాటలో దక్కించుకున్నట్లు గ్రామ కార్యదర్శి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ మత్స్యశాఖ చైర్మన్ నియామకంపై పునరాలోచించాలి

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ నియమకంపై ప్రభుత్వం పునరాలోచించాలని ఫిషరీస్ సొసైటీ జిల్లా కన్వీనర్ స్వామిముదిరాజ్ కోరారు. రాష్ట్రంలో సుమారు 5000 మత్స్య సహకార సంఘాలు ఉండగా, అందులో ముదిరాజ్ సంఘాలు 4300, బెస్త సంఘాలు కేవలం 700 ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఎక్కువ సంఘాలు కలిగి ఉన్న ముదిరాజ్‌లకు చైర్మన్ పదవి ఇవ్వకుండా తక్కువ శాతం ఉన్న బెస్తవారికి కేటాయించడం విచారకరమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి చైర్మన్‌గా ముదిరాజ్‌లనే నియమించాలని విజ్ఞప్తిచేశారు. ఈ ఏడు మృగశిర కార్తె వెళ్లి అరుద్ర కార్తె వచ్చినా.. ప్రభుత్వం చేపపిల్లల పంపిణీపై ఊసే ఎత్తడం లేదన్నారు. చేపల చెరువులపైనే ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు సకాలంలో చేపపిల్లలు అందించి ఆదుకోవాలన్నారు.

◆ సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో బుధవారం సీసీ రోడ్డు పనులను ఎంపీపీ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాండు, కృష్ణ, అరవింద్, మహేశ్, రామలింగం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

◆ సైబర్ నేరాలపై అవగాహన

చేగుంట(తూప్రాన్): సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ బాలరాజు అన్నారు. బుధవారం సాయంత్రం చందాయిపేటలో సైబర్ నేరాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీలు చెప్పమంటే చెబితే బ్యాంకుల్లో డబ్బు పోతుందన్నారు. లాటరీలో డబ్బులు వచ్చాయనే గుర్తు తెలియని వ్యక్తుల మాటలను నమ్మరాదని పేర్కొన్నారు. గ్రామంలో దొంగతనాల నివారణకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను కాపాడుకోవాలన్నారు. శాంతిభద్రలకు సంబంధించిన సంఘటనలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు, మహిళలు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ ప్రొటోకాల్ విస్మరించిన తహసీల్దార్

శివ్వంపేట(నర్సాపూర్): విధులపై అంకితభావంతో వ్యవహరించాలిన తహసీల్దార్ శ్రీనివాస్‌చారి ప్రొటోకాల్ విస్మరించాడని ఎంపీపీ హరికృష్ణ బుధవారం ఆరోపించారు. శివ్వంపేట మండలానికి 97 కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరయ్యాయి. వాటి పంపిణీ సంబంధించి నర్సాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి తనకు సమాచారం ఇవ్వకపోవడంపై విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాస్‌చారి వివరణ కోరగా ఎంపీపీ హరికృష్ణకు చెక్కుల పంపిణీ గురించి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తే అందుబాటులోకి రాలేదని మేసేజ్ చేశానన్నారు.

◆ నాయకులను విమర్శించడం సరికాదు'

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులు కొన్ని రోజుల ముందు మెదక్‌లో జరిగిన ఘర్షణ గురించి బీజేపీ నాయకులను విమర్శించడం సరికాదని మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ సమావేశంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సిద్ధరాంరెడ్డి, సంజీవ్, తిరుపతి, పంజా బాబు, రాజిరెడ్డి, రమేష్, కుమార్, ప్రవీణ్, మహేశ్, సతీశ్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇసుక లారీ పట్టివేత

రామాయంపేట(మెదక్): అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని బుధవారం రామాయంపేట వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేవని ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. పట్టుబడ్డ లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశామన్నారు.

◆ కౌడిపల్లి ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా ఓంప్రకాష్

కౌడిపల్లి(నర్సాపూర్): ఉపాధ్యాయుల పదోన్నతుల్లో భాగంగా మండాలనికి అయిదుగురు ఎల్‌ఎఫ్‌ఎల్ (లో ఫిమేల్ లెట్రసి) హెచ్‌ఎంలు పదోన్నతిపై వచ్చారు. మండల కేంద్రం కౌడిపల్లిలోని ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా టి. ఓంప్రకాష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని బూరుగడ్డ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తుండగా.. పదోన్నతిపై కౌడిపల్లికి వచ్చారు. కంచన్‌పల్లికి కృష్ణకాంత్, సలాబత్‌పూర్‌కు రాంసింగ్, తునికికి చంద్రశేఖర్, మహ్మద్‌నగర్‌కు సత్యవతి ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా పదోన్నతిపై వచ్చారు. దీంతో పాటు ఎస్‌జీటీ ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, జ్ఞానప్రకాష్, నర్సింలు, రమేశ్ తదితరులు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై వివిధ ఉన్నత పాఠశాలలకు వెళ్లారు.